ప్రజాశక్తి

శుక్రవారం 5 జనవరి 2024

విజయనగరం

ఆర్ఎంపి రాష్ట్ర నాయకులు గౌరినాయుడు మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని రాజపులోవ జంక్షన్‌లో 20 సంవత్సరాలుగా ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలు అందిస్తూ సామాజిక కార్యక్రమాలు చేస్తున్న ఆర్ఎంపిల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు వాల్లె గౌరినాయుడు గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. బుధవారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆయన మృతి పట్ల ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షులు జంగం జోషీ, జిల్లా అధ్యక్షులు చిరంజీవి, చుట్టు పక్కల గ్రామ ప్రజలు, పలువురు నాయకులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు.

ఆడలేం ఆంధ్ర

- క్రీడలు ఆడేందుకు ఆసక్తి చూపని క్రీడాకారులు
- ఆడకుండా మండల పోటీలకు ఎంపిక
- 1,2 ఆటలతో సరిపెట్టుకుంటున్న నిర్వాహకులు
- కొన్ని పాఠశాలల్లో పూర్తిగా జరగని ఆడుదాం ఆంధ్ర

క్రీడాకారులు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఖండ్యాం మైదానం

ప్రజాశక్తి- రేగిడి

సచివాలయాల పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఎక్కడా కానరావడం లేదు. 17 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వరకు ఎవరైనా ఈ క్రీడల్లో పాల్గొని వచ్చని ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. అట్టహాసంగా ఈ క్రీడలను ప్రారంభించిన ప్రభుత్వం క్రీడల నిర్వహణకు ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.10వేలు కేటాయించింది. దీంతో ఈ నిధులు వాటర్ ప్యాకెట్లకే చాలని పరిస్థితి నెలకొందని నిర్వాహకులు వాపోతున్నారు. కాగా క్రీడా ప్రాంగణంలో సదుపాయాలు లేకపోవడంతో క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ వంటి ఆటలు ఆడేందుకు యువత పెద్దగా ఆసక్తి చూపని పరిస్థితి నెలకొంది. ఈ క్రీడల్లో పీడీలు, పిఇటిలు, సచివాలయ ఉద్యోగులు తప్ప క్రీడాకారులు కనిపించడంలేదు. దీంతో కొన్ని పాఠశాలల్లో ఒకటి, రెండు ఆటలతో సరిపెట్టి, మిగతా వాటికి ఆటలు ఆడించకుండా క్రీడాకారులను మండల స్థాయి ఎంపిక చేసే పనిలో పీడీలు, పీఈటీలు ఉన్నారు. మరికొన్ని పాఠశాలల్లో క్రీడలను ఆడించకుండా పంచాయతీల వారీగా ఎవరు బాగా క్రీడలు ఆడుతారో వాలంటీర్ల ద్వారా పేర్లు నమోదు చేయించుకుని మండల స్థాయి క్రీడలకు ఎంపిక చేసి జాబితాలు సిద్ధం చేస్తున్నారు. పూర్తిస్థాయి క్రీడాలకు నిధులు మంజూరు చేస్తే భోజన, వసతితో పాటు క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తే ఈ ఆడుదాం ఆంధ్ర క్రీడలకు స్పందన వచ్చేదేమో అని క్రీడాకారులు చెబుతున్నారు. మండలంలో కొమిరి, ఉంగరాడ, అంబకండి, పనసలవలస, అంబాడ వెంకటాపురం గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రకు క్రీడాకారులు కరువయ్యారు. సౌకర్యాలు లేకపోవడంతో చాలా మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడం లేదు. ఒకవేళ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు మించి ఖర్చు పెడితే ఆ నిధులు తిరిగి తమకు ఇస్తారో ఇవ్వరోనని ఎవరూ అధనంగా ఖర్చుపెట్టేందుకు ముందుకు రావడం లేదు. ఉన్న నిధులను ఖర్చు పెట్టి చేతులెత్తేస్తున్నారు. దీంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం మండలంలో వెలవెల బోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ క్రీడల పట్ల శ్రద్ధ తీసుకొని క్రీడాకారులను ఉన్నత స్థాయి ఆటలకు ఆడేందుకు కృషి చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

మా దృష్టికి ఫిర్యాదు రాలేదు

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ప్రారంభించినప్పటి నుంచి ఎంపిక చేసిన సచివాలయ పరిధి పాఠశాలలో క్రీడలు ఆడిస్తున్నాం. కొన్ని పంచాయతీ పరిధి గ్రామాల పాఠశాలలో క్రీడలు ఆడించలేదన్న విషయం మా దృష్టికి రాలేదు. ఎక్కడ ఆడలేదో ఆ పంచాయతీ పరిధి క్రీడాకారులను పిలిపించి ఆడిస్తాం. ఆడని క్రీడాకారులను మండల స్థాయికి వస్తే వెనుక్కు పంపిస్తాం. ఈ నెల 10న మండల స్థాయి క్రీడలు ఆడిస్తాం.

శ్యామల కుమారి, ఎంపిడిఒ, రేగిడి

ప్రచారం చేసినా రావడం లేదు

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు ప్రచారాలు చేసినప్పటికీ క్రీడాకారులు రావడం లేదు. రిజిస్ట్రేషన్ ప్రాప్తికి వచ్చిన వారితో ఆటలు ఆడిస్తున్నాం. క్రీడలకు రాని క్రీడాకారులను ఇంటికి వెళ్లి పిలుస్తున్నాం. సదుపాయాలు కల్పిస్తున్నాం. పంచాయతీ పరిధిలో జరిగిన క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎంపిక చేసిన పాఠశాలల్లో మండల స్థాయిలో ఆడిస్తాం.

సత్యనారాయణ, మండల స్పోర్ట్స్ కన్వీనర్, రేగిడి

సమగ్ర శిక్ష ఉద్యోగుల ర్యాలీ

- ఎస్‌పిడి వైఖరిపై మండిపడ్డ ఉద్యోగులు
- 16వ రోజుకు చేరిన సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం నాటికి 16 వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన శిబిరం నుంచి ఆర్అండ్ బి అతిథి గృహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు తమ పట్ల బెదిరింపులకు పాల్పడటం సరైంది కాదన్నారు. ప్రధానంగా ఎస్‌పిడి అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానకరంగా మాట్లాడటం సరికాదన్నారు. తాము హక్కుల కోసం పోరాడుతున్నామని, బెదిరిస్తే భయపడేది లేదని అన్నారు. మహిళా ఉద్యోగులు పట్ల ఎస్‌పిడి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, సమస్యలు పరిష్కరించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. శుక్రవారం చలో విజయవాడకు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గురువులు, శ్రీనివాసరావు ఉద్యోగులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

బిజెపి మద్దతుదార్లను ఓడిద్దాం

సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న ఎన్నికల్లో బిజెపితో ఉన్న పార్టీలను ఓడిద్దామని, రాజ్యాంగ పరిరక్షణకు చేయి చేయి కలుపుదామని మేలుకో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీమ్ సభ్యులు కెఎమ్ఎ శుభాన్ అన్నారు.మేలుకో ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం యూత్ హాస్టల్‌లో న్యాయవాది పి.రమేష్‌రాజు అధ్యక్షతన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శుభాన్ మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన, దేశంలో మతోన్మాదాన్ని మనువాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపిని తిరిగి అధికారంలోకి రానివ్వకూడదని అన్నారు. రాష్ట్రంలో మూడు ప్రాంతీయ పార్టీలు కూడా బిజెపితో చేతిలు కలుపుతున్నాయని అన్నారు. దళిత, ఆదివాసీ బహుజన, క్రిస్టియన్,ముస్లిం మైనారిటీలంతా ఐక్యం కావాల్సిన అవసరం వుందని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని రక్షించు కోవడానికి అభ్యుదయ వాదులంతా కలిసి రావాలని పిలుపు నిచ్చారు. అఖిలభారత విద్యా హక్కు వేదిక అధ్యక్షులు డి రమేష్ పట్నాయక్, వాదనా తోడో అభియాన్ స్టీరింగ్ కమిటీ మెంబర్ థామస్ పల్లిథానం, మేలుకో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సలహాదరు ఫాదర్ బోస్కో, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్, సిపిఎం నాయకులు రెడ్డి శంకర్రావు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ శీర రమేష్, క్రిస్టియన్ రైట్స్ ఫోరమ్ ప్రతినిధులు అలజంగి రవికుమార్, జీవన్ ,జేసుదాస్, జమాతే ఇస్లామి హింద్ నాయకులు కరీముల్లా, జిల్లా ముస్లిం ఐక్యవేదిక షరీఫ్, మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జిల్లా అధ్యక్షుడు సయద్ హఫీజ్, డిబియస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న వివిధ సంఘాల, పార్టీల ప్రతినిధులు

ఫుడ్ కమిషన్ సభ్యులు పర్యటన

ప్రజాశక్తి-డెంకాడ

విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్‌కమిషన్ సభ్యులు కాంతారావు

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు గురువారం డెంకాడ మండలం గుణుపూరు పేట, పెద్ద తాడివాడ గ్రామాల్లోని రేషన్ డిపోలను ఆయన తనిఖీ చేశారు. డిపోల్లో స్టాకును, సరుకుల నాణ్యతను పరిశీలించారు. స్టాక్ బోర్డులను సక్రమంగా నిర్వహించాలని, కచ్చితంగా వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. పెద్ద తాడివాడ జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి పై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా పిల్లలకు వివరించారు. ఎండియు వాహనం ద్వారా జరుగుతున్న రేషన్ సరుకుల పంపిణీను తనిఖీ చేశారు. సరుకులు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుతున్నదీ లేనిది ఆరా తీశారు. ఈ పర్యటనలో డిప్యూటీ తహశీల్దార్ కొట్నాన శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంపై తిరుగుబాటు

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు తప్పదని టిడిపి విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైసిపికి ఎమ్మెల్యేలు, ఎంపీలు గుడ్ బై చెప్తున్నారని అన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతరేకతను దృష్టిలో ఉంచుకుని ఆ పార్టీకి రాజీనామాలు చేస్తున్నారని అన్నారు. వైసిపిలో చాలా మంది ఎంపీలు తమ రాజకీయ భవితవ్యం ఎలా ఉంటుందో వారికే అర్థం కావడం లేదని, జగన్ రెడ్డిని నమ్ముకుంటే రాజకీయ భవిష్యత్తు అంధకారమే అని భావించి పార్టీ మారుతున్నారని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఎపి అభివృద్ధి పదేళ్లువెనక్కి నెట్టబడిందన్నారు.. దీంతో ప్రజల నుంచి వస్తున్న నిరసన జ్వాలలకు ఆహుతి కాకముందే వైసిపికి గుడ్‌బై చెప్పి ఇతర పార్టీలకు మారుతున్నారని అన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం అనివార్యమని, ఆయన వస్తేనే తమ పిల్లలకు భవిష్యత్తు ఉంటుందని ప్రజలు ధృఢంగా నమ్ముతున్నారని నాగార్జున అన్నారు.

ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం : కోలగట్ల

ప్రజాశకి-విజయనగరం టౌన్

ప్రజలకు మేలు జరగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. అందుకు తగ్గట్టుగానే ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులకు, వితంతువులకు మూడు వేల రూపాయల పింఛను అందజేస్తున్నారని పేర్కొన్నారు. పెరిగిన పింఛను మొత్తాన్నిగురువారం స్థానిక జొన్నకుడిలో 26, 27 డివిజన్లకు సంబంధించిన పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ రాజకీయాల కతీతంగా ప్రభుత్వ పథకాలను నేరుగా అందించడమే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ పొందాలంటే వేరొక పింఛను దారుడు మరణిస్తే గాని సాధ్యపడేది కాదన్నారు. కానీ అర్హత ఉంటే నేరుగా ఇంటి వద్దకే ఒకటో తేదీ కల్లా పింఛన్లు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్చార్జి రెడ్డి గురుమూర్తి, స్థానిక కార్పొరేటర్

పింఛను అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

24వ రోజుకు అంగన్వాడీల సమ్మె

- అమ్మోరు రూపంలో వినూత్న నిరసన
- 24అంకె రూపంలో ప్రదర్శన
- బెదిరించడం మానుకోవాలి : నాయకులు

కొత్తవలస : మెడకు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పె ంచాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు వినూత్న నిరసనలు చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శిబిరంలో వేప జంటలు పట్టుకొని అమ్మోరులా ఊగుతూ జగన్మోహన్ రెడ్డికి మంచి బుద్ధి ఇవ్వాలని, తమ వేతనాలు పెంచాలని కోరుతూ వినూ త్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, నాయకులు రాధ, ఉష, సుశీల తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్ని నోటీసులు ఇచ్చిన బెదిరింపులకు పాల్పడినా బెదిరేది లేదని తెలిపారు.

24 అంకెతో అంగన్వాడీల నిరసన

గజపతినగరం : సమ్మె చేపట్టి 24 రోజులైన సందర్భంగా జాతీయ రహదారి పక్కన అంగన్వాడీలు 24 అంకె ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సి ఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ ఏ సమస్యనైనా క్షణాల్లో పరిష్కారం చేస్తానని చెప్పుకుంటున్న మన ముఖ్యమంత్రి 24 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్య కోసం మాత్రం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని, లేనియెడల ఆరో తేదీ నుండి సమ్మెను ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎం సుభాషిని, డి నాగమణి, సన్యాసమ్మ, జ్యోతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : 24 నెంబరు ఆకారంలో అంగన్వాడీల ప్రదర్శన

ఉరి తాళ్లతో నిరసన

కొత్తవలస : అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె శిబిరంలో మెడకు ఉరితాళ్లు వేసుకొని వినూత్న నిరసన తెలిపారు. 24 రోజులగా సమ్మె చేసున్నా ప్రభుత్వం కనీసం స్పందించుకోవడం విచారకరమని అంగన్వాడీ ప్రాజెక్టు నాయకురాలు కాకర తులసి ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం చేసే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. అధిక సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలంతా సమ్మె కొనసాగించారు. విధులకు హాజరు కావాలని ప్రభుత్వం పంపిన సర్క్యులర్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు డి.శ్యామల, డి.జయలక్ష్మి, ఎఐటియుసి అనుబంధ సంఘం నాయకులు వి.మాణిక్యం, కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తెరవాలని నాయకుల ఒత్తిడి

స్పృహ తప్పి పడిపోయిన అంగన్వాడీ కార్యకర్త

భోగాపురం : భోగాపురంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్త స్పృహ తప్పి పడిపోయింది. కేంద్రాలు తెరవాలని నాయకులు ఒత్తిడి చేయడం వల్లే ఇలా జరిగిందని అంగన్వాడీలు ఆరోపించారు. పూసపాటిరేగ మండలం కుమిలి పంచాయతీ పెదపత్తినవలస గ్రామానికి చెందిన తాతయ్యమ్మ కార్యకర్తగా పనిచేస్తుంది. పంచాయతీ సర్పంచ్ ఆమె భర్తకు ఫోన్ చేసి అంగన్వాడీ కేంద్రం తెరవాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఆమె భర్త తాతయ్యమ్మకు ఫోన్ చేసి కేంద్రం తెరవాలని గురువారం ఉదయం నుంచి ఒత్తిడి చేశాడు. భర్తతో మాట్లాడుతుండగా ఆందోళనతో స్పృహతప్పి పడిపోయింది. వెంటనే అక్కడ ఉన్న అంగన్వాడి కార్యకర్తలు ఆమెను మోసుకుంటూ వెళ్తుండగా ఎస్ఐ కష్ణమూర్తి తన జీపులో సుందరపేట ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుత ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కేంద్రాలు తెరవాలని నాయకులు ఒత్తిడి చేయడం సరికాదని యూనియన్ నాయకురాలు కృష్ణవేణి అన్నారు.

రాజాం : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను బెదిరించడం మానుకొని సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారానికి కృషి చేయకుండా అంగన్వాడీలను బెదిరించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం బెదిరిస్తే భయపడేది అంగన్వాడీ ఉద్యమం కాదని, సిఐటియు అండగా ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జామి : తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీలంతా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కనకమహాలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గాడి అప్పారావు, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల పోరాటానికి యుటిఎఫ్ ఆర్థిక సహాయం

కొత్తవలస 16 రోజులుగా సమ్మె చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల పోరాటానికి యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యాన ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 106మంది ఉపాధ్యాయులు రూ.32వేలు రూపాయలు, యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు సిహెచ్ నిర్మలాదేవి 2వేలు మొత్తం రూ.34వేలు అందజేశారు. ఇందులో రూ.4వేలు గత 24 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు అందించాలని జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జి. వెంకట నాయుడు కోరారు. పోరాటనిధిని సర్వశిక్ష ఉద్యోగుల ప్రతినిధులు రామారావు, అరుణమ్మకు అంగన్వాడీ ప్రతినిధులు గాడి అప్పారావు, చుక్క తులసిలకు అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.విజయగౌరీ, నిర్మలాదేవి పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో బైఠాయింపు

ప్రజాశక్తి-భోగాపురం

మహిళా పోలీస్ తమ పట్ల అనుచిత వాఖ్యలు చేసినందున క్షమాపణలు చెప్పాలంటూ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కృష్ణవేణి ఆధ్వర్యంలో అంగన్వాడీలు స్థానిక పోలీసు స్టేషన్‌లో బైఠాయించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మండలంలోని ఎ.రావివలస పంచాయితీలో అక్కడ వైసిపి నాయకుల ఆదేశాలతో గురువారం కార్యకర్తలు కేంద్రాలను తెరిచారంటూ సమ్మెలో ఉన్న అంగన్వాడీలకు తెలిసింది. దీంతో అమకాం, కొయ్యావానిపాలెం గ్రామాలకు వెళ్లి కేంద్రాలను తెరవవద్దని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కృష్ణవేణితో సహా పలువురు హెచ్చరించారు కేంద్రాలు తెరిచి సమ్మెను నాశనం చేయవద్దని కోరారు. సచివాలయ సిబ్బంది సమాచారంతో అక్కడికి వచ్చిన మహిళా కానిస్టేబుల్‌కు, యూనియన్ నాయకులు కృష్ణవేణికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. మహిళా కానిస్టేబుల్ అనుచిత వాఖ్యలు చేయడంతో కృష్ణవేణితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బైఠాయించారు. క్షమాపణలు చెప్పేవరకు ఇక్కడ నుంచి కదలబోమని కూర్చొన్నారు. ఇంతలో సిఐ బివి వెంకటేశ్వరరావు, ఎస్.ఐ కృష్ణమూర్తి వచ్చి ఇలా స్టేషనులో బైఠాయించడం సరికాదని అన్నారు. క్షమాపణలు చెప్పేంత వరకు వెల్లేదిలేదని అంగన్‌వాడీలు చెప్పడంతో పోలీసులకు, కృష్ణవేణికి మధ్య కొంత వాగ్వివాదం చోటు చేసుకుంది. చివరకు అంగన్‌వాడీలు స్టేషను నుంచి బయటకు వెళ్లకుండా వారిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు కొంతసేపు గేటు వేశారు. ఈ నేపథ్యంలో సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ వచ్చి సిఐతో మాట్లాడారు. సమ్మెకు సహకరించాలని కోరి ఆందోళన విరమించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తానే తెరవాలని ఒత్తిడి తెచ్చినట్లు అంగన్‌వాడీలు ఆరోపించడం సరికాదని ఆ పంచాయితీ సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి అన్నారు. అందులో తనకు ఎటువంటి సంబంధంమూ లేదని, తాను ఎవరినీ ఒత్తిడి చేయలేదని అన్నారు.

పోలీసుస్టేషన్‌లో బైఠాయించిన అంగన్వాడీలు

తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ కార్యదర్శులు

విశాఖ డెయిరీ చైర్మన్ ప్రథమ వర్ధంతి

వేపాడ: మండల కేంద్రంలోని విశాఖ డెయిరీ మిల్కు కార్యాలయం వద్ద స్వర్గీయ విశాఖ డైరీ చైర్మన్ ఆడారి తులసీరావు ప్రథమ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డైరీ సూపర్‌వైజర్ నాయుడు మాట్లాడుతూ తులసి రావు విశాఖ డైరీ ద్వారా పాల రైతులకు చేసిన సేవలు ఎనలేనివని, సేవలకు మనమంతా రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల విశాఖ డైరీ పాల ఉత్పత్తి సంఘాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

వేపాడ: స్థానిక ప్రాథమిక పాఠశాలలో లూసీ బ్రెయిలీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి పి.బాలభాస్కరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అర్జున్ రావు మాట్లాడుతూ బ్రెయిలీ కనుగొన్న లిపి కారణంగా ఎంతోమంది అందులు చదువుకునే అవకాశం కలిగిందన్నారు. ప్రతి ఒక్కరిలో ప్రతిభ సామర్థ్యాలు ఉంటాయని వాటిని గుర్తించి ప్రతి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అటువంటి వారి భవిష్యత్తుకు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు ఎన్ సత్యవతి, సిహెచ్ జయశ్రీ, ఎన్ విజయలక్ష్మి, సమగ్ర శిక్ష ద్వారా వికలాంగులకు అందుతున్న సేవల గురించి వివరించారు.

విద్యార్థులకు నేత్రపరీక్షలు

డెంకాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉన్న అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, కెజిబివిలో విద్యార్థులకు గత నెలలో నిర్వహించిన ప్రత్యేక కంటి వైద్య శిబిరంలో సుమారు 2,766 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 167 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిలో డెంకాడ కెజిబివిలో దృష్టి లోపంతో ఉన్న 42 మంది విద్యార్థులకు గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో జెవిఎస్ కంటి వైద్య శిబిరాల ఆప్తాల్మిక్ ఆఫీసర్ మజ్జి గణపతి రావు, మోపాడ పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణాధికారి సిహెచ్.సత్యనారాయణ, ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్.సూరిబాబు, ప్రిన్సిపాల్ భవాని తదితరులు పాల్గొన్నారు.

టిడిపి పార్లమెంటరీ కన్వీనర్‌గా రాకేష్‌శర్మ

రాకేష్‌శర్మ

పూసపాటిరేగ : టిడిపి బ్రాహ్మణ సాధికారసమితి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం కన్వీనర్‌గా మండలంలోని గుంపాం గ్రామానికి చెందిన ఇనుగంటి రాకేష్‌శర్మను నియమించారు. ఈ మేరకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం ప్రకటించారని రాకేష్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా రాకేష్‌శర్మ మాట్లాడుతూ తనకు పార్లమెంటరీ కన్వీనర్‌గా నియమించిన అధినేత చంద్రబాబు, లోకేష్‌బాబు, అశోక్‌గజపతిరాజు, కిమిడి నాగార్జున, నెల్లిమర్ల ఇంచార్జి కర్రోతు బంగారురాజు, మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు, మహంతి చిన్నంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి శంకరరావు తదితర నాయకులుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించడానికి కృషి చేస్తానని చెప్పారు.

చైతన్య బస్సుయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విజయనగరం కోట: టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్మిక చైతన్య బస్సుయాత్ర గోడ పత్రికలను గురువారం స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతి రాజు, నియోజకవర్గ ఇంచార్జి అతిథి గజపతి ఆవిష్కరించారు. ఈనెల 6న శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ప్రారంభమై కుప్పం వరకు కొనసాగుతుందని తెలిపారు. నియోజకవర్గ టిఎన్‌టియు సి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొంప ఆనందరావు, బొట్టా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం వితరణ

శృంగవరపుకోట: పట్టణంలో సేవలందిస్తున్న 70 మంది పారిశుధ్య కార్మికులకు స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రూ.48 వేలు విలువ చేసే యూనిఫాంలను గురువారం పంచాయతీ కార్యాలయ ఆవరణంలో కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎఎస్ వెంకట్రావు, కార్యదర్శి మందా సుబ్బారావు, ఉపాధ్యక్షులు బుగత వెంకటేశ్వరరావు, ఎం ఎస్ఎన్ మూర్తి, వి. శ్రీరామమూర్తి, వి.ప్రసాద్, డాక్టర్ యం.వేణు, యం.రామకృష్ణ, కె.శ్రీను, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, ఎంబీఎస్ ప్రసాద్, ప్రవీణ్, వి. రాము, పి.దేముడు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకుడిగా మాట్లాడం సరికాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - పార్వతీపురం

సమగ్ర శిక్ష అభియాన్ కెజిబివి టీచర్ల సమ్మెకు సంబంధించి ఎస్‌పిడి చేసిన వ్యాఖ్యలు రాజకీయ నాయకులను మరిపిస్తున్నాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన రావు అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్నారు తప్ప ఇప్పుడు కొత్తగా కోరిన కోర్కెలు కావని అన్నారు. సమ్మెలో ఉన్న టీచర్లను, ఉద్యోగులను పిలిచి ప్రజాస్వామ్యయుతంగా చర్చించి సమస్యలను పరిష్కరించాలి తప్ప బెదరించడం సరికాదని అన్నారు. అలాగే సమ్మెలో ఉన్న వారిని తొలగిస్తామని చెప్పడం మానవత్వం లేని వారి మాటలని అన్నారు. ఇప్పటికైనా బెదిరింపులు మాని, సమస్యలను పరిష్కరించాలని హితవు పలికారు.

కవ్వింపు చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి - రాజాం

ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మెపై కవ్వింపు చర్యలు మానుకొని సమస్యల పరిష్కారం చేయాలని, లేకపోతే ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. రాజాంలో గురువారం మున్సిపల్ కార్మికులు నిర్వహించిన అర్ధనగ్న ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 26 నుండి మున్సిపల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె చేస్తుంటే వాళ్లకు పోటీగా కార్మికులను తెచ్చి కవ్వింపు చర్యలకు, రెచ్చగొట్టే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కాకి సురేష్, జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్ కుమార్, కనకరాజు, హరి, అప్పలరాజు, కృష్ణ, సోమేష్, లక్ష్మీ, పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు జనసేన మద్దతు

బొబ్బిలి: కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ కాంట్రాక్టు

విజయనగరం: పొర్లు దండాలు పెడుతున్న కార్మికులు, నాయకులు

కార్మికులు చేపట్టిన సమ్మెకు జనసేన మద్దతు ప్రకటించింది. సమ్మె నిరసన శిబిరాన్ని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి సందర్శించి గురువారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన జగన్ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో కార్మికుల పోరాటానికి అండగా ఆందోళన చేస్తామన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మికులు భజన చేస్తూ నిరసన తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.గౌరీష్ డిమాండ్ చేశారు.

నెల్లిమర్ల: ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. 8వ రోజు గురువారం నగరపంచాయతీ కార్యాలయం వద్ద నోట్లో గడ్డి పెట్టుకుని కార్మికులు నిరసన తెలిపారు. రామారావు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలు సైతం పక్కన పెట్టి సేవలు అందించిన నగర పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. బాబురావు, బి.హరిబాబు, జె.శ్రీను, బి. రాము, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: గత పది రోజులుగా సిఐటియు అనుబంధ సంఘం పారిశుధ్య కార్మికులు నగరంలో పారిశుధ్య పనులు నిలిపివేసి సమ్మె చేస్తుండగా గురువారం నుంచి ఎఐటియుసి అనుబంధ సంఘం కార్మికులు కూడా సమ్మెలోకి దిగారు. దీంతో నగరంలో పూర్తి స్థాయిలో పారిశుధ్య సేవలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రెండు సంఘాలు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరశన శిబిరాలు ఏర్పాటు చేసి నిరసనలు సాగించారు. సిఐటియు అనుబంధ సంఘం కార్మికులు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్

నిరసన ర్యాలీలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

రాజాం : అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. చట్ట ప్రకారం రావాల్సిన హక్కులు అడుగుతున్నా అమలు చేయడం లేదన్నారు. తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించి వెంటనే సమ్మె విరమింపచేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాస్కరరావు, బి.రమణ, రమా, రాజు, రజని కార్మికులు పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిందే..

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాల్సిందేనని, అంతవరకు సమ్మె విరమించేది ఎఐటియుసి నాయకులు అశోక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయకుండా కార్మికులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రంగరాజు, కామేష్ కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జాతీయ స్థాయి పురుష, మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో కొండవెలగాడ క్రీడాకారిని దేవిశ్రీ పాల్గొని ప్రతిభ కనబర్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్ రాజీవ్ గాంధీ యునివర్సటీలో గత నెల 28 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి మెన్, ఉమెన్, యూత్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ సబ్ జూనియర్ విభాగం పోటీల్లో గురువారం కొండ వెలగాడకు చెందిన జీనపాటి దేవిశ్రీ 71 కిలోల విభాగంలో స్నాచ్ 78 కిలోలు, క్లీన్ జర్క్ 100కిలోలు బరువెత్తి రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా దేవిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.లక్ష్మీనారాయణ, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి. వెంకట రామయ్య, బి .లక్ష్మి, కోచ్ చల్లా రాము అభినందించారు.

దేవిశ్రీ

జాతీయ బాక్సింగ్ పోటీల విజేతలకు అభినందన

విజయనగరం టౌన్: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలలో విజేతలైన క్రీడాకారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అభినందించారు. డిసెంబర్ 24 నుండి 29 వరకు మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో అండర్ 19,14 బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో నగరానికి చెందిన టి.వసంత్, డి.దేవస్వరూప్ కాంస్య పతకాలు సాధించారు. దేవస్వరూప్ విటి అగ్రహారంలోని సన్‌రైజ్ ఇంగ్లీషు మీడియం స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా క్రీడాకారులు కోలగట్ల నివాసానికి చేరుకుని పోటీల వివరాలను, విజేతలైన వారి వివరాలను రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్ కోలగట్లకు పరిచయం చేశారు. క్రీడాకారులను అభినందించిన కోలగట్ల భవిష్యత్తులో కూడా మరింత ప్రతిభను కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో జిల్లా ఖ్యాతిని ఇనుమడింప జేయాలని ప్రోత్సహించారు. కోచ్ బి. ఈశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు గణేష్ ఎంపిక

28వ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు గంట్యాడ మండలం ఆర్.వసంత గ్రామానికి చెందిన దమరసింగ్ గణేష్ ఎంపిక య్యాడు. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం విజయపూర్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ సైక్లింగ్ టీమ్ తరుపున గణేష్ ఈ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా గణేష్‌కు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావులు, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్ రాజు, సపక్ తక్రా కార్యదర్శి రాజేష్ అభినందనలు తెలిపారు. ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.

క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

జాతీయ వాలీబాల్ పోటీలలో సందీప్ ప్రతిభ

బొబ్బిలి: భువనేశ్వర్‌లో గతనెల 22 నుంచి 26 వరకు జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో గురుకుల బాలుర పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి కె.సందీప్ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ స్థాయి పోటీలలో దేశవ్యాప్తంగా 31 జట్లు పాల్గొనగా రాష్ట్రం నుంచి పోటీలలో పాల్గొన్న జట్టులో సందీప్ ఉన్నాడు. సందీప్ ప్రతిభ కనబరచడంతో ప్రిన్సిపాల్ రఘునథ్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

గేమింగ్ టూల్‌పై కార్యశాల

విజయనగరం: సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీ రింగ్ రెండు, మూడవ సంవత్సరం విద్యార్థులకు 'యూనిటీ గేమింగ్ టూల్' పైన ఈనెల 2 నుంచి 8 వరకు కార్యాశాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థకు చెందిన ట్రైనర్ ఎం.సతీష్ మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లోని అన్ని విభాగాలకు 'గేమింగ్ అభివృద్ధి', సాఫ్ట్‌వేర్‌లో సమాన అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకోవడంలో విద్యార్థులంతా సఫలీకృతం కావడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులకు కల్పన, గేమింగ్, రూపకల్పన, కార్యనిర్వహణ, కార్య సాధన ఉండాలని సూచించారు.

ప్రయాణికులకు బహుమతులు

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్‌టిసి డిపో పరిధిలో పల్లెవెలుగు బస్సులలో జామి -విజయనగరం, తాటిపూడి విజయనగరం, కొట్యాడ విజయనగరం, గుమ్మకోట రూట్లలో ప్రయాణించే ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్ ప్రవేశపెట్టినట్లు స్థానిక డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 17 నుంచి ప్రయాణించిన వారికి గురువారం బస్టేషన్ ఆవరణలో సిబ్బంది, ప్రయాణికుల సమక్షంలో డ్రా తీసి విజేతలకు బహుమతులు అందచేశారు.

అభివృద్ధికి నోచని జంట గ్రామాలు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రమైన వేపాడ, వల్లంపూడి గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ రెండు గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మేజర్ పంచాయతీగా ఏర్పడితే తప్ప ఈ గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశాలే లేవు. తమ స్వార్థం కోసం స్థానిక రాజకీయ నాయకులు మేజర్ పంచాయతీగా ఏర్పాటు చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రమైన వేపాడలో కట్టవలసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, శాఖ గ్రంథాలయం, స్టేట్ బ్యాంక్, పోస్ట్ ఆఫీస్, విద్యుత్ కార్యాలయం వల్లంపూడి గ్రామంలో ఉన్నాయి. వేపాడ గ్రామంలో వల్లంపూడి గ్రామానికి చెందిన పోలీస్ స్టేషన్ ఉంది. ఇప్పటికైనా స్థానిక నాయకులు రెండు గ్రామాలను కలిపి మేజర్ పంచాయతీగా ఏర్పాటు చేస్తే అధిక నిధులు వస్తాయని వాటితో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చునని చెబుతున్నారు.

వేపాడలోని ఒక వీధి పరిస్థితి

విద్యార్థులపై శ్రద్ధచూపాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఏ గ్రేడ్‌లో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉప విద్యా శాఖాధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు. ఆరికతోట జెడ్పీ హైస్కూల్లో గురువారం సంవత్సరాంత తనిఖీల్లో భాగంగా విచ్చేసిన ఆయన స్కూల్లో వివిధ రికార్డులు, స్కూల్ పరిసరాలు, విద్యార్థులకు సంబంధించిన అన్ని ధృవ పత్రాలు పరిశీలించారు. మాక్ డ్రిల్, యోగా వివిధ క్రీడలపై ఇస్తున్న తర్ఫీదు స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించి వారిలో ఉన్న సృజనాత్మకత వెలికి తీసేలా నూతన రీతిలో బోధనా పద్ధతులు అవలంబించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేసి మెనూ ప్రకారం రుచిగా, వేడిగా ఆహార పదార్థాలు అందివ్వాలన్నారు. భోజనాలు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్న చిన్న పొరపాట్లు ఉన్నప్పటికీ తనిఖీలు సంతృప్తి కరంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ తిరుమల ప్రసాద్, హెచ్.ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు

కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాపర్తి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. విశాఖ రైల్వే డివిజన్ మేనేజర్ సౌరబ్ ప్రసాద్ పాల్గొని వికలాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ముందుగా కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని, గురుదేవా హాస్పిటల్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. డిఆర్ఎం ప్రసాద్ మాట్లాడుతూ తాను ఉద్యోగ రీత్య వివిధ ప్రాంతాల్లో పని చేశానని కానీ విశాఖ రైల్వే డివిజన్‌కు వచ్చిన తరువాత, కొత్తవలస రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఈ గ్రామంలో గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఉందని, దాని ద్వారా కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమానికి తనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించేందుకు వ్యవస్థాపకులు వచ్చారని సిబ్బంది చెప్పటంతో సంతోషం వ్యక్తం చేశానని అన్నారు. గతేడాది కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాదంలో సత్వరమే స్పందించి గురుదేవ హాస్పిటల్ నుండి అంబులెన్స్ పంపించి యాక్సిడెంట్ అయిన ప్రాంతంలో సేవలు కూడా అందించారని, అలాంటి ట్రస్టును సందర్శించేందుకు తనను ఆహ్వానించడంతో ఎలాగైనా రావాలని అనుకున్నానని అన్నారు. ఉన్నతమైన చదువు చదివిన జగదీష్ బాబు సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందించి పునర్జన్మ ప్రసాదిస్తున్నారని అన్నారు. తనవంతుగా ట్రస్టుకు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలను పరిశీలిస్తున్న డిఆర్ఎం ప్రసాద్

నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన బాలోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

బాలోత్సవంలో భాగంగా స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, స్పెల్ బి క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకు న్నాయి. అనంతరం పోటీల్లో గెలిచిన అభ్యర్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలో త్సవ నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస రావు మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను, కలలను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని మొట్ట మొదటిసారిగా విజయనగరంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆహ్వాన సంఘం గౌరవ సభ్యులు డోల మన్మధకుమార్, చైర్మన్ దవళ సర్వేశ్వర రావు, అధ్యక్షులు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు బహుమతులు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - వంగర

వైసిపి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జెడ్‌పి చైర్మన్ చేతుల మీదుగా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వం దేనని, పేదలను ఆదుకోవడమే ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. వైసిపి ప్రభుత్వం పేదల బాగోగులను చూస్తుంటే, చంద్రబాబు పెద్దోళ్ళ బాగు కోసం చూస్తాడని విమర్శించారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ మాట్లాడే ముందు బావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టారు. తనతో కలిసి 10 ఏళ్ల పని చేసిన ఎమ్మెల్యే కంబాల జోగులు పాయకరావుపేట ఇన్చార్జిగా వెళ్లిపోవడాన్ని తాను జీర్ణించుకోలేక పోతున్నాని చెప్పారు. రాజాం నియోజకవర్గం వైసిపి ఇన్చార్జిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రముఖ వైద్యులు డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన ఈ గౌరవం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం సెర్ప్ ఉన్నతి మహిళా శక్తి పథకం ద్వారా మండలంలోని మగ్గూరు గ్రామానికి చెందిన సిర్లి అశ్వనీకి మంజూరైన ఆటో రిక్షాను వారంతా కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శన్ రావు, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ కనకల భారతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. **గజపతినగరం:** పింఛన్ల పంపిణీ కార్యమ్రాన్ని గురువారం మరుపల్లి సచివాలయ ఆవరణలో ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తవుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. తుమ్మికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాధ రావు, మరుపల్లి సర్పంచ్ లెంక, రామలక్ష్మి, ఎంపిడిఒ కె.కిషోర్ కుమార్, సెక్రటరీ జి.కృష్ణ పాల్గొన్నారు.


భోగాపురం: పింఛన్ సొమ్మును అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైయస్సార్ పించనుకానుక కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జనవరి నెల నుంచి 3వేలరూపాయలు పింఛను అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టారని అన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పింఛన్లు, ఈ పట్టా లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి, మండల వైసిపి కన్వీనర్ ఉప్పాడ నారాయణరెడ్డి, పడాల భాను ప్రకాష్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, పడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని వావిలపాడు, నల్లబెల్లి, ఎన్‌కెఆర్ పురం, బానాది గ్రామాల్లో ఎంపిపి డి. సత్యవంతుడు చేతుల మీదుగా గురువారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి. రాజేశ్వరి, బి. సతీష్, ఎన్‌కెఆర్‌పురం సర్పంచ్ జి.దేవి, బానాది సర్పంచ్ కె యశోద, వైసిపి మండల అధ్యక్షుడు జగ్గు బాబు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పింఛన్ అందిస్తున్న ఎంపిపి, సర్పంచ్

డెంకాడ: కొత్తగా మంజూరైన పింఛన్లను, రూ.3వేలకు పెరిగిన పింఛన్లను స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పింఛను దారుడుకు రూ.3వేలకు పింఛను పెంచారన్నారు. మండలంలో సుమారు 7,900 పింఛన్లు ఇస్తున్నామని మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్ముునాయుడు, జెడ్‌పిటిసి బడుకొండ లక్ష్మి, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, ఎపిఎం విజయలక్ష్మి, సర్పంచులు, ఎంపిటిసిలు, సొసైటీ చైర్మన్లు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మెరకముడిదాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వంలో అవ్వ, తాతలకు, రూ.3వేలకు పింఛన్లు పెంచడంతో గ్రామాలలో పండగ వాతావరణం నెలకొందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉత్తరవిల్లి, రాచగుమడాం పంచాయతీల్లో లబ్ధిదారులకు జెడ్‌పి చైర్మన్ చేతులు మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, మండల నాయకులు తాడ్డి వేణు, ఎస్‌వి రమణరాజు, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్, వైస్ ఎంపిపి టి. హరిబాబు, పాల్గొన్నారు.

బైరిపురం 470 మంది లబ్ధి దారులకు సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉప సర్పంచ్ పప్పల కృష్ణ మూర్తి, వైస్ ఎంపిపి కందుల పార్వతి, గ్రామ పెద్దలు పప్పల గ్రహణేశ్వరరావు, కందుల మల్లికార్జునరావు, సెక్రటరీ దామోదర్ గురువారం పింఛన్లు పంపిణీ చేశారు.

జామి: అవ్వ తాతాలకు జగన్ ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు పింఛన్ చేశారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో నూతన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, జెసిఎస్ మండలం ఇంచార్జి చంద్రునాయుడు, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ గుడివాడ రాజేశ్వరరావు, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


వంగర: పింఛను ఇస్తున్న జెడ్‌పి చైర్మన్

డైరెక్టర్ సత్యారావు, అల్లు పద్మ, జామి సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, జాగరం ఎంపిటిసి పోటిపిరెడ్డి నరసింహ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సామాజిక పింఛన్ల సొమ్మును రూ.3వేలుకు పెంచడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, జెసిఎస్ పట్టణ కన్వీనర్ రేజేటి విస్సు, కౌన్సిలర్లు ఎస్.రామకృష్ణ బాబు, ఒమ్మి లక్ష్మి పలు వార్డులలో వేర్వేరుగా గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మురళి, శంబంగి వేణు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఫస్ట్‌ఫ్లోర్, పి.వి.ఎస్. ప్రైమ్, ఎ.జి. రోడ్,
3 లాంతర్ సెంటర్, విజయనగరం.ఫోన్ :80746 56196

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-01-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 228.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 80088 12798